క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారు

అన్నవరం: స్థానిక దేవస్థానం హైస్కూల్ వద్ద కొలువైయున్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి నూతన ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున నాలుగు గంటలకే స్వామి, అమ్మవారికి సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, హోమాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 11. గంటలకు ఆయుష్య హోమం పూర్ణాహుతి నిర్వహించారు. శ్రీవల్లీ దేవసేన, సుబ్రహ్మణ్యస్వామివార్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించారు.

యోగాంధ్రాను విజయవంతం చేయాలి

గోకవరం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా శనివారం నిర్వహిస్తున్న యోగాంధ్రా కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని ఎంపీడీఓ గోవిందు శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. గోకవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనే విధంగా సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆదిత్య బోధన సిబ్బందికి శిక్షణ



డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో పాల్గొన్న ఆదిత్య అధ్యాపకులు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఏఐ టూల్స్ ఫర్ రీసెర్చ్ అండ్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ టెక్నిక్స్ అనే అంశాలపై రెండు రోజుల పాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించినట్టు డిప్యూటీ ప్రో.చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొదటి రోజు బెంగళూరు అలయన్స్ యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.సేంతా మర్రైకన్నన్, ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధ్యాయులు రీసెర్చ్ స్కిల్స్ పెంపొందించడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యత గురించి వివరిస్తూ ఏఐ ఆధారిత ఉపకరణాలపై హ్యాండ్స్–ఆన్ వివిధ అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ ఆదిరెడ్డి రమేష్, రమాశ్రీ, సురేష్, శరవణన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మేలు

జగ్గంపేట: భూసార పరీక్షలతో రైతులకు అన్ని విధాల మేలు జరుగుతుందని ఇఫ్కో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మేనేజర్ జి.శ్యామ్ ప్రసాద్ బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని కాట్రావులపల్లిలో గ్రామ పొలాల్లో రైతులకు భూసార పరీక్షలు, వాటితో కలిగే లాభాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మట్టి నమూనాలను సేకరించారు. భూసార యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. పంటల అనంతరం పచ్చి రొట్ట పెంచడం ద్వారా భూసారం పెరిగి నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని తెలిపారు. నానో ఎరువులు వాటి ప్రాముఖ్యత, డ్రోన్ ద్వారా ఎరువులు పిచికారి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కో సిబ్బంది దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

పిల్లలతో అంగన్‌వాడీలు మమేకం కావాలి

గోకవరం: అంగన్‌వాడీ సిబ్బంది ప్రతి నిత్యం పిల్లలతో మమేకం కావాలని కోరుకొండ సీడీపీఓ సంధ్యారాణి పేర్కొన్నారు. మండలంలోని గోకవరం, తంటికొండ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలతో మమేకమై వారితో ఆటపాటలతో సందడి చేశారు. రికార్డులు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ప్రతీ అంగన్‌వాడీ కార్యకర్త నిబద్ధతతో పని చేసి విద్యార్థుల హాజరు మెరుగుపడేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ పి.ఇందిరారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు దుర్గాభవానీ, రాజ్యలక్ష్మీ ఉన్నారు.

అనారోగ్యంతో వార్డు సభ్యుడి మృతి



పదిలం అప్పారావు (ఫైల్)

గోకవరం: మండల కేంద్రం గోకవరం పంచాయతీ వార్డు సభ్యుడు పదిలం అప్పారావు (34) మృతి చెందాడు. స్థానిక 14వ వార్డు సభ్యుడిగా సేవలందిస్తున్న ఆయన కొద్ది నెలల క్రితం తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతికి ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సర్పంచ్ కొమరం శ్రావణి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, పార్టీ నాయకులు సంతాపం తెలిపారు.

సాగుకు రైతన్న సమాయత్తం

- చురుగ్గా నారుమడుల తయారీ పనులు
- సొంతంగా విత్తనాల తయారీ
- మెట్టాకు, దంపాకు పద్ధతుల్లో నారుమడులు



కోదాడలో ఖరీఫ్ వరినారు కోసం దంపాకు పద్ధతిలో విత్తనాలు వేస్తున్న రైతులు

తొండంగి: మండల పరిధిలోని ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే పలకరించడంతో వర్షాలు బాగా కురిస్తున్నాయి. తొలకరి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు వరిసాగుకు నారుమడులు సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. కోటి ఆశలతో ఇప్పటికే ట్రాక్టర్లతో దుక్కులు దున్నడంతో పాటు పశువుల ఎరువును తొలి సాగుకు సిద్ధమవుతున్నారు.

16వేల ఎకరాల్లో సాగు

మండలంలోని వ్యవసాయబోర్ల పరిధిలో రెండు వేల ఎకరాలు, పంపా, పీబీసీ ఆయకట్టు పరిధిలో దాదాపుగా 14 వేల ఎకరాల్లోనూ మొత్తంగా 16వేల ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్‌లో వరిసాగు జరుగనుంది. మెట్ట గ్రామాల్లో మెట్టాకు పద్ధతిలోనూ పల్లపు ప్రాంతాల్లో దంపాకు పద్ధతుల్లో నారుమడులు సిద్ధం చేస్తున్నారు. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు మెట్ట ప్రాంతాల్లో గోపాలపట్నం, శృంగవృక్షం, ఏ.కొత్తపల్లి, తొండంగి, కృష్ణాపురం, పైడికొండ, పి.అగ్రహారం, బెండపూడి, చిన్నాయపాలెం, రావికంపాడు ప్రాంతాల్లో నారుమడులను దుక్కి చేసి విత్తనాలు వేస్తున్నారు. ఏ.వి.నగరం, కోదాడ, శృంగవృక్షంపేట, సీతారాంపురం, కొమ్మనాపల్లి తదితర ప్రాంతాల్లో నారుమడుల కోసం పొలాలను దమ్ములు చేసి విత్తనాలు వేస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ బోర్లు పరిధిలో సాగునీటి లభ్యత ఉండటంతో దంపాకు పద్ధతిలో నారుమడులు వేస్తున్నారు.

నకిలీ విత్తనాలతో అప్రమత్తత

వ్యవసాయ శాఖ నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన పురుగు మందులు విక్రయించకుండా జాగ్రత్తపడాల్సిన అవసరం ఉందని రైతు నాయకులు కోరుతున్నారు. వ్యవసాయ అధికారులు నకిలీ విత్తన వ్యాపారులపై కొరఢా ఝులిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు కోరుతున్నారు.గతంలో కృష్ణాపురం, ఏ.వి.నగరం, కొమ్మనాపల్లి మరికొన్ని గ్రామాల్లో ప్రైయివేటు విత్తనాలు ఖేళీలు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో అత్యధికంగా రైతులు సన్నరకాల విత్తనాలను సొంతంగా తయారు చేసుకుని నారుమడులకు వినియోగిస్తున్నారు. నారు పెరిగిన అనంతరం 25 రోజుల నుంచి నెలరోజుల లోపుగా నారును తీసి పొలాల్లో నాట్లు వేయనున్నారు. ఈ నెలాఖరు నుంచి ఆగస్టు మొదటి వారం వరకు వరినాట్లు పనులు మొదలు కానున్నాయి. దీనికోసం నారుమడులు మినహా మిగిలిన పొలాల్లో మరిన్ని వర్షాలు కురిస్తే సాగు నీటి లభ్యతను బట్టి ట్రాక్టర్లతో దమ్ములు చేయనున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ బోర్లు పరిధిలోనూ క్రమంగా ఇతర ప్రాంతాల్లోనూ పనులు ముమ్మరంగా సాగనున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ సాగు కోసం వరి విత్తనాలను రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మండల విస్తరణాధికారి మాధన సతీష్ వర్మ తెలిపారు.

యోగాను దినచర్యగా పాటించాలి



యోగాసానాలు చేస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య, అభ్యాసకులు



యోగాలో పాల్గొన్న ఎస్సైలు, ఇతర పోలీస్ సిబ్బంది

తుని రూరల్: యోగా ప్రతీవ్యక్తి జీవితంలో భాగం కావాలని, తప్పనిసరిగా దినచర్యలో పాటించాలని ఎమ్మెల్యే యనమల దివ్య పేర్కొన్నారు. శుక్రవారం గెడ్లబీడు సాయివేదిక ప్రాంగణంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని యోగాసనాలు వేశారు. తుని పట్టణంలో యోగా కేంద్రాల నిర్వాహకులను శాలువాలతో సత్కరించి, కార్యక్రమంలో పాల్గొన్నవారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. వి.కొత్తూరులోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.లలిత అధ్యక్షతన యోగాపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ భువనసుందరి, మాజీ చైర్మన్ కుసుమంచి శోభారాణి, మున్సిపల్ కమీషనర్ వెంకట్రావు, యోగా అభ్యాసకులు పాల్గొన్నారు.

పోలీసుల యోగాసనాలు

ప్రత్తిపాడు: అంతర్జాతీయ యోగాంధ్ర దినోత్సవాలను పురస్కరించుకుని ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, స్టేషన్ సిబ్బంది సరయు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సైలు లక్ష్మీకాంతం, రామలింగేశ్వరరావు, శ్రీహరి మాట్లాడుతూ ఆరోగ్యం, ఆనందకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ నిత్యం 45 నిమిషాలు యోగాసానాలు నిర్వహిస్తే అనారోగ్యాలు ధరి చేరవన్నారు.

అంతా నా ఇష్టం..!

- పదవి లేకపోయినా పరపతితో హుకుం
- పంచాయతీ సిబ్బందిని హడలెత్తిస్తున్న వైనం



ప్రైవేట్ వ్యాపార ప్రదేశంలో పనిచేస్తున్న పంచాయతీ పారిశుధ్య కార్మికుడు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం గ్రామ పంచాయతీకి ఓ వ్యక్తి అనధికార సర్పంచ్‌గా వ్యవహరిస్తూ అధికారుల వద్ద గ్రామంలోను హుకుం జారీ చేస్తున్నారు. ఆతడికి పదవి లేకపోయినప్పటికి పరపతితో అజమాయిషీ చెలాయిస్తు తానే సర్పంచ్ అని చెప్పుకోవడంతో తమ అవసరాల నిమిత్తం సర్పంచ్ కాని సర్పంచ్‌ను ఆశ్రయించాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. తమ పనుల కోసం సచివాలయానికి వెళ్తే ఆయన అనుమతి కావాల్సి వస్తోందని, వెళ్దామంటే రామేశంపేటలో ఆవ్యక్తి నివాసం ఉండటంతో మూడు కిలోమీటర్ల వెళ్లిరావాల్సి వస్తోందని వాపోతున్నారు. అతడి వ్యవహారశైలి ఇటు అధికారులు, అటు గ్రామస్తులకు తలనొప్పిగా మారింది. ఈ ధోరణిలో తన సొంత పనులకు సైతం ప్రభుత్వ శాఖలను ఉపయోగించుకుంటున్నట్టుగా పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో ఉపాధి కూలీలను తన సొంత పనులకు ఉపయోగించుకుంటున్నాడు. ఈ మధ్య కాలంలో ఆతడి వ్యాపార ప్రదేశంలో పంచాయితీ పారిశుధ్య కార్మికులతో సొంత పనులు చేయించుకోవడం ఏమిటని అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉత్తమ సేవా అవార్డుల ప్రదానం



కలెక్టర్ నుంచి ఉత్తమ సేవా అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ ప్రసాద్, వీఆర్ఓ ప్రశాంత్ కుమార్



తొండంగిలో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సన్మానిస్తున్న తహసీల్దార్ మురార్జీ

తుని రూరల్: తుని తహసీల్దార్ జీవీఎస్.ప్రసాద్ ఉత్తమ సేవా అవార్డును శుక్రవారం అందుకున్నారు. శుక్రవారం రెవెన్యూ డేను పురస్కరించుకుని కాకినాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్ చేతులమీదగా ఈ అవార్డును అందుకున్నట్టు తహసీల్దార్ ప్రసాద్ పేర్కొన్నారు. ఉత్తమ సేవా పురస్కారం లభించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను తుని కార్యాలయంలో డీటీ ప్రదీప్, విఆర్వోలు. సిబ్బంది శాలువాతో సత్కరించి. శుభాకాంక్షలు తెలిపారు.

వీఆర్ఓ ప్రశాంత్‌కు ఉత్తమ పురస్కారం

రౌతులపూడి: మండల కేంద్రం రౌతులపూడిలో వీఆర్ఓగా పని చేస్తున్నా వి.ప్రశాంత్ కుమార్ సేవలను గుర్తిస్తూ ఉత్తమ పురస్కారం వరించింది. రెవెన్యూ దినోత్సవాన్ని పురష్కరించుకొని కాకినాడ కలెక్టర్ కార్యలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యాక్రమంలో ఈ పురస్కారాన్ని కలెక్టర్ షాన్ మోహన్ పెద్దపురం ఆర్‌డిఒ శ్రీ రమణిలు ప్రశంస పత్రాన్ని, అవార్డును అందచేశారు. ఈ సందర్భంగా వీఆర్ఓగా ప్రంశాత్ కుమార్‌కు, తహసీల్దార్ నరేష్, వీఆర్ఓలు, గ్రామ రెవెన్యూ సహాయకులు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

తొండంగి: ప్రభుత్వ ఉద్యోగాల్లో రెవెన్యూ విభాగంలో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఉత్తమ సేవలందించడం ద్వారానే మంచి గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ మురార్జీ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన విశ్రాంత ఉద్యోగులు అన్నవరంకు చెందిన రిటైర్డ్ ఆర్ఐ జి.నూకరాజు, శృంగవృక్షంకు చెందిన వీఆర్ఏ గున్నయ్య తదితరులను ఘనంగా సన్మానించారు. ఉద్యోగంలో అన్నివర్గాలకు ప్రజలకు ఉత్తమ సేవలందించడం ద్వారా మంచి గుర్తింపుతో పాటు ఆత్మసంతృప్తిని కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజారావు, వీఆర్వోలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పురోహితులకు వైద్య పరీక్షలు

ఇన్సూరెన్స్ కవరేజ్‌తో పురోహితులకు చికిత్స



వైద్య శిబిరంలో పాల్గొన్న ఈఓ సుబ్బారావు, పురోహిత సంఘం అధ్యక్షుడు కన్నబాబు, వైద్యులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో పనిచేస్తున్న వ్రత పురోహితులకు శుక్రవారం స్థానిక దేవస్థానం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్రతపురోహిత సంఘం సహకారంతో మమత ఆసుపత్రి, మాక్స్‌విజన్ కంటి ఆసుపత్రి, ఎస్ఎస్ఆర్ డెంటల్ హాస్పిటల్స్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో నిపుణులు పరీక్షలు చేపట్టారు. శిబిరాన్ని దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు ప్రారంభించారు. వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు, దేవస్థానం ధామర్తి కన్నబాబు మాట్లాడుతూ దేవస్థానం వ్రత పురోహితులందరికీ మెడికల్ ఇన్సూరెన్స్ కల్పించామని తెలిపారు. తమ అభ్యర్థన మేరకు ట్రోవిటీ ఇన్సూరెటెక్ బ్రోకింగ్ సంస్థ ప్రముఖ ఆసుపత్రుల వైద్యులతో కలిసి ఈ వైద్య శిబిరం నిర్వహించిందని పేర్కొన్నారు. వైద్య పరీక్షల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పురోహితులకు ఇన్సూరెన్స్ కవరేజ్ ద్వారా వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో దేవస్థానం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, ఫార్మసీ సూపర్‌వైజర్ మాధవి, వివిధ ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు

గోకవరం: విశాఖలో ప్రధాని మోదీ అధ్యక్షతన శనివారం నిర్వహించే యోగాంధ్రా దినోత్సవాన్ని పురస్కరించుకుని గోకవరం ఆర్టీసీ డిపో నుంచి శుక్రవారం భారీగా బస్సులను తరలించారు. దీనితో సర్వీసులు సక్రమంగా లేకపోవడంతో ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. డిపో నుంచి సుమారు 44 ఆర్టీసీ బస్సులను అక్కడకు పంపించడంతో పలు రూట్లలో బస్సు సర్వీసులు రద్దయ్యాయి. డిపోకు 49 ప్రభుత్వ ఆర్టీసీ బస్సులు, 14 ప్రైవేటు భాగస్వామ్య బస్సులు కలిపి మొత్తం 63 బస్సులు ఉండగా 44 బస్సులను విశాఖపట్నంకు పంపించడంతో పలు రూట్లలో సర్వీసులు తగ్గిపోయాయి. రాజమహేంద్రవరంకు మూడు, కాకినాడకు నాలుగు, అడ్డతీగల, రంపచోడవరంకు ఒక్కొక్క సర్వీసు మాత్రమే నడుస్తున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో ప్రయాణించే ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైయివేటు వాహనాల ద్వారా రాకపోకలు సాగిస్తున్నామని ప్రయాణీకులు వాపోతున్నారు.

ముగిసిన సీఏటీసీ-7 క్యాంపు



ఆదిత్య శిక్షణా క్యాంపులో పాల్గొన్న క్యాడెట్స్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో సీఏటీసీ–7 క్యాంపు శుక్రవారంతో ముగిసినట్టు కమాండింగ్ ఆఫీసర్ గ్రూప్ కెప్టెన్ ప్రవీణ్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. పది రోజుల పాటు నిర్వహించిన ఈ క్యాంపులో క్యాడెట్స్‌కి దేశ భద్రత, సైబర్ నేరాలపై అవగాహన, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ద్వారా ప్రకృతి విపత్తుల అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ శిబిరానికి తెలుగు రాష్ట్రాల నుంచి 450 మంది క్యాడెట్స్ పాల్గొన్నట్లు వెల్లడించారు.

ముగిసిన శిక్షణ శిబిరం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో హ్యూమన్ వాల్యూస్–11 అనే అంశంపై 8 రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసినట్టు డిప్యూటీ ప్రో.చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రస్తుత సమాజంలో విద్యతోపాటు మానవతా విలువలు కూడా విద్యార్థులకు అవసరమని తెలియజేస్తూ విద్యార్థుల్లో మానవతా విలువలు పెంపొందించడంలో ఫ్యాకల్టీ తోడ్పాటు ఉండాలని భావించి ఉపాధ్యాయ సిబ్బందికి ఈ శిక్షణ తరగతులు నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఎంబి.శ్రీనివాస్, డీన్ వానతి, ఆర్ సుధాకర్ రెడ్డి, సూర్య వెంకటేష్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా వెబినార్



పెరుమాళ్లపురంలో అవగాహన ర్యాలీ చేస్తున్న జెడ్పీ హైస్కూలు విద్యార్థులు

తొండంగి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శుక్రవారం యోగా 'ఫర్ వన్ ఎర్త్– వన్‌హెల్త్' అంశంపై జాతీయస్థాయి వెబినార్ నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.కె.మెహర్ తెలిపారు. ఇంటర్నెట్ ద్వారా జాతీయస్థాయిలో నిర్వహించిన ఈ వెబినార్‌లో జాతీయ యోగా నిపుణులు, యోగా థెరపిస్ట్ డాక్టర్ ఆర్.వెంకటేశ్వరరావు, ఒడిస్సాకు చెందిన డాక్టర్ ఎం.ఎల్.ఎం.లక్ష్మి రిసోర్సు పర్సన్లుగా వ్యవహించారన్నారు. పివి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అవగాహన ర్యాలీ

యోగా ప్రాధాన్యతపై పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూలు విద్యార్థులు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయలు చాట్రాతి.వి.వి.సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్లకార్డులతో బీచ్‌రోడ్డులో పలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యాప్రకమిటీ చైర్మన్, ఇతర సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు విడుదల చేయాలి



ధాన్యం బకాయిల విడుదలపై గోనేడలో వీహెచ్ఏ హరితకు వినతి పత్రం అంద చేస్తున్న రైతులు

కిర్లంపూడి: ఇటీవల ప్రభుత్వం కనుగోలు చేసిన ధాన్యం డబ్బులు తక్షణమే విడుదల చేయాలని రైతులు ఆందోళనకు దిగారు. మండల పరిధి గోనేడలోని రైతులు స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం ధాన్యం బకాయిలు పూర్తిస్థాయిలో చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని ధర్నా నిర్వహించారు. అనంతరం వీహెచ్ఏ ఎం.హరితకు వినతి పత్రాన్ని అందజేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ రబీ సీజన్‌లో ప్రభుత్వం కనుగోలు చేసిన ధాన్యం డబ్బులు, అకాల వర్షంతో నీట మునిగిన పంట నష్ట పరిహారం డబ్బులు గత మే 5వ తేదీ తరువాత ఏ రైతు ఖాతాలోను జమా కాలేదన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు డబ్బులు విడుదల చేయాలని లేని పక్షంలో నిరసన కార్యక్రమం చేపడతామని రైతులు హెచ్చరించారు. దీనిపై మండల వ్యవసాయశాఖ అధికారి సుధామాధురిని వివరణ అడగగా రైతులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. రైతులు మాదిరెడ్డి సుబ్బారావు, మహలక్ష్మిరావు, కడియాల విశ్వనాథం, కొట్టు సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్యనగర్‌లో నీటి ఇక్కట్లు



సత్యసాయి తాగునీటి ట్యాంకు నుంచి నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

గోకవరం: గోకవరం పట్టణంలోని స్థానిక సంజీవయ్య నగర్‌లో ప్రజలు నీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. స్థానిక ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో సమీప ప్రజలకు నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఓవర్ హెడ్ ట్యాంక్‌పై ఆధారపడి సుమారు 200 కుటుంబాలు నీటి అవసరాలు తీర్చుకుంటున్నాయి. అయితే ట్యాంకుకు నీటిని సరఫరా చేసే బోరు నుంచి నీటి నిల్వాలు తగ్గాయి. దీంతో కుళాయిల నుంచి నీటి సరఫరా నిలిచి తీవ్రమైన నీటి కోరత ఏర్పడింది. సమస్యను గుర్తించిన స్థానిక నాయకులు, పంచాయతీ అధికారులు మరో బోరును 20 రోజుల క్రితం ఏర్పాటు చేశారు. కానీ నూతనంగా ఏర్పాటు చేసిన బోరు నుంచి సైతం నీటి సరఫరా లేకపోవడంతో కష్టాలు తప్పడంలేదు. ప్రస్తుతం స్థానికులు సత్యసాయి తాగునీటి నుంచి నీటిని తెచ్చుకుని నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. దీనిపై అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి సంజీవయ్యనగర్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ మహిళలు కోరుతున్నారు.

మండల వ్యవసాయ అధికారిగా నరసింహం



జగ్గంపేట: జగ్గంపేట మండల వ్యవసాయ అధికారిగా ఎస్.నరసింహం శుక్రువారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న రెడ్ల శ్రీరామ్ గండేపల్లి మండల వ్యవసాయ అధికారిగా బదిలీ అయ్యారు. ఈ మేరకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన నరసింహం మాట్లాడుతూ తొండంగి మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తూ బదిలీపై జగ్గంపేట వచ్చానన్నారు. తన పరిధిలోని వ్యవసాయ రంగం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

హార్టికల్చర్ ఆఫీసర్‌గా శ్రీవల్లి



జగ్గంపేట: జగ్గంపేట ఏరియా హార్టికల్చర్ ఆఫీసర్‌గా ఎ.శ్రీవల్లి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఏలేశ్వరం హార్టకల్చర్ ఆఫీసర్‌గా పని చేస్తూ బదిలిపై ఆమె జగ్గంపేట వచ్చానన్నారు. జగ్గంపేట హార్టికల్చర్ ఆఫీసర్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న లావణ్య బదిలీపై కడియం వెళ్లారు. ఈ మేరకు శ్రీవల్లి మాట్లాడుతూ తన పరిధిలోని ఉద్యానవన పంటల సాగు మరింత అభివృద్ధి చెందేలా రైతులకు అన్ని విధాలుగా సహకరిస్తానని ఆమె తెలిపారు.

సర్వేయర్‌కి సిబ్బంది వీడ్కోలు

తుని రూరల్: మండల సర్వేయర్ దేవుడు బదిలీపై పెద్దాపురం వెళ్లడంతో రెవెన్యూ సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్ ఆధ్వర్యంలో సర్వేయర్‌ను సత్కరించారు. సుదీర్ఘకాలం తుని మండలంలో సేవలు అందించడం అభినందనీయమన్నారు. డీటీ ప్రదీప్, విఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

తుని రూరల్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 6 నుంచి 9 తరగతుల్లో సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు వి.కొత్తూరు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. నిర్మలకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ ఆసక్తిగల అభ్యర్థులు సమీపంలోని గురుకులాల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ నెల 25న ఉదయం 10.గంటల నుంచి 11.గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. కాకినాడ సాంబమూర్తి నగర్ డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో బాలికలు, అనపర్తి మండలం లక్ష్మీ నరసాపురంలో బాలురు గంట ముందు పరీక్షకు హాజరుకావాలన్నారు.

అనధికార క్వారీలపై దాడులు

రౌతులపూడి: మండలంలోని ములగపూడి, ఎస్.పైడిపాల, ఉప్పాంపాలెం గ్రామాల్లో అనాధికారికంగా నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీలపై శుక్రవారం మైనింగ్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో నాలుగు లారీలను, మూడు జేసీబీలను స్వాదీనపరుచుకున్నారు. ములగపూడిలో ఒక జేసీబీ,ఉప్పాంపాలెంలో మరో జేసీబీ, లారీని, ఎస్.పైడిపాలలో ఒక జేసీబీని, మూడు లారీలను స్వాధీనపరుచుకున్నట్లు పేర్కొన్నారు. వాహనాలను స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించామని మైనింగ్ అధికారులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైన అనుమతి లేకుండా క్వారీలు నిర్వహణ చేపడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ దాడుల్లో మైనింగ్ డీడి ఫణిభూషణ్ రెడ్డి, ఇన్స్‌పెక్టర్ మురళికృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ శివ, సత్యతేజ పాల్గొన్నారు.

జైలు శిక్ష, జరిమానాల విధింపు

జగ్గంపేట: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలోని గత రెండు రోజులుగా సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 21 మందిని అదుపులోకి తీసుకుని శుక్రువారం పెద్దాపురం కోర్టులో హాజరు పరిచామని జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. వారిలో 12 మందికి ఒక్కక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా, 7 గురుకి 3 రోజులు జైలుశిక్ష, ఇద్దరికి 2 రోజులు జైలు శిక్ష విధించినట్లు ఆయన వెల్లడించారు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

తొండంగి: మండలంలోని బెండపూడిలో సారా తయారీకి వినియోగించే బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు తుని ఎక్సైజ్ ఇన్‌చార్జ్ ఎస్.హెచ్.ఓ శివప్రసాద్ శుక్రవారం తెలిపారు. గ్రామశివారులో సారా తయారీ కోసం బెల్లం ఊటను సిద్ధం చేసినట్టు తమకు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో కలిసి తనిఖీలు చేయాగా సుమారు వెయ్యి లీటర్ల బెల్లం ఊటను డ్రమ్ముల్లో నిల్వ ఉంచగా వాటిని సిబ్బందితో కలిసి ధ్వంసం చేసామన్నారు. నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని, మండలంలో ఎవరైనా చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రాజానగరం: జాతీయ రహదారిపై తూర్పుగానుగూడెం వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ శుక్రవారం మృతి చెందిందని రాజానగరం ఎస్సై నాగార్జున తెలిపారు. గండేపల్లి మండలం మురారికి చెందిన దేవరకొండ సూర్యారావు తన భార్య గంగాభవానితో కలసి మోటారు సైకిల్‌పై రాజమహేంద్రవరం వెళ్లి వస్తుండగా గురువారం రాత్రి ప్రమాదానికి గురయ్యారు. బైకు వెనుక భాగంలో తగలించిన బ్యాగ్ ఒకటి వెనుక నుంచి వస్తున్న వాహనానికి తగులకోవడంతో రోడ్డుపై పల్టీ కొట్టారు. ఈ సంఘటనలో గంగాభవానీ తలకు బలమైన గాయం కావడంతో ఆమెను చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. సూర్యారావుకు స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదానికి కారణమైన వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.